కళారాధకుడు

1

నీలాకాశం కారుమబ్బులుకమ్మివుంది. విశ్రాంతిగా షికారుపోదామని లీలవచ్చింది. వాన వస్తుందేమో అని భయపడ్తూనే, వస్తే ఫర్వాలేదులెద్దూ అనుకుంటూ గొడుగుపుచ్చుకొని బయల్దేరాం;. మా అమ్మ వెనకనించి అన్నది ''చలిగాలి వీస్తోందిగదుటే, ఇప్పుడేం షికారు?'' అని. చదువుకుంటున్న వాళ్ళం ముసలమ్మలమాట వింటామా? బయల్దేరాం. తేనాంపేటమీదుగా ఆళ్వార్‌పేట టర్నింగ్‌దగ్గరికి వొచ్చాం. 'కొంచెం పైకిపోదామా?' అన్నాను లీలవంక చూచి. లీల నాకన్న వస్తుతఃకొంటెది. అది నా ప్రశ్నకి నవ్వి 'నిన్నెవర్నీ ఎత్తుకెళ్ళనీయను లేవోయ్! భయపడకమ్మా' అన్నది, ముందు నడుస్తో.

''ఇట్లా నడిరోడ్డుమీద పరాచకాలాడవద్దని ఎన్నోసార్లు చెప్పాను. బుద్ధుంటేగా!'' అన్నాను లేనికోపంతో. ఆకాశంలో నల్లనిమబ్బుల్ని చీల్చుకుంటూ పడమరనుండి కొబ్బరి ఆకులమీదపడే ఆరంజిరంగు సూర్యకిరణాలు లీల మొహంమీద వింతగా ప్రతిఫలిస్తున్నాయి. ఆమె కిలకిలా నవ్వింది.

''ముసలాళ్ళ ఛాందసం నీకు వొంటబట్టోంది.'' అన్నది చకచక నడకసాగిస్తూ.

ప్రకృతి సౌందర్యం పురుషుడికీ స్త్రీకి ఒకేవిధమైన వుద్వేగాన్ని కలిగిస్తుంది గావును! నేనూ లీలా ప్రకృతి శోభకి ముగ్ధులమై మౌనంగా లజ్‌వేపుకి నడుస్తున్నాం. మబ్బులు నల్లబడి, సన్నగా తుప్పర ప్రారంభమైంది. లీల గొడుగు విప్పి 'గొడుగులోకి రావోయ్! తడిస్తే కరిగిపోగలవు' అంది మళ్ళీ పరాచకంగా. నేనేమీ మాట్లాడలేదు. రెండు మూడు గజాలు నడిచేప్పటికి వాన జోరుగా కురియసాగింది. గొడుగు యిద్దర్నీ వాననుంచి రక్షించలేకపోతోంది. ఒక పక్క సగం తడుస్తూనే గబగబ నడిచాం, ఎక్కడన్నా నుంచుందామని. అరుగులన్నా లేవు... లీల భారత్‌కేఫేలో జొరబడి, స్త్రీల ప్రత్యేకస్థలం అని వున్న గదిలోకి వెళ్ళింది. నేనూ ఆమెని అనుసరించాను. కుర్చీమీద కూర్చోబోతూ, ''రావే కల్యాణీ! ఎప్పుడూ ఆలస్యమే'' అని పిలిచింది లీల. నేనూ ఆమెకి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాను తడిసినపైట పిండికుంటూ మొహంమీది నీళ్ళు తుడుచుకొని, ''కాఫీ తాగుదాం?'' అన్నది లీల.

''సరే'' అన్నాను సంసిద్ధురాల్నై.

మేము గబగబ లోపలికి రావటంచూచి కొంతమంది మొగరాయుళ్ళు, హేండ్ కర్చీఫులు అడ్డం పెట్టుకుని ముసి ముసినవ్వులు నవ్వుతున్నారు. ఆ నవ్వులు చూస్తే నాకు వొళ్లు మండింది. గడపలో మా ఆర్డర్‌కోసం ఎదురుచూస్తున్న సర్వర్ వంక చూడకుండానే లీల, ''రెండు కాఫీ, స్ట్రాంగ్'' అన్నది.

కాఫీ వొచ్చింది. నిదానంగాతాగాం. వాన వెలుస్తుందేమో బయటికి పోదామని చూస్తున్నాం. ఎంతకీ వెలిసేకళ కనపడలేదు. లైట్లువెలిగాయి. 7 గంటలు కావస్తోంది. మా అన్నయ్య కోప్పడతాడేమో అని నాకు దిగులేస్తోంది. గదినుండి బయటికివచ్చాం. ఇంకా చినుకులు పడుతున్నై. బయటికి ఎట్లా పోవడం?... లీలకి ఇదే తాపత్రయం. హోటల్ గడపమీద నుంచొని చెయ్యిజాపి చినుకులు తగ్గాయేమో అని చూస్తున్నది లీల. ఒక మగపెద్దమనిషి మా తాపత్రయం గమనించి కాబోలు '' ఎక్కడికి వెళ్ళాలండి? బండి పిలవమంటారా?'' అని అవ్యాజప్రేమ ప్రకటించాడు. మగవాసన ఏమాత్రమూ గిట్టని లీల ''మీ సహాయాన్ని ఎవరూ కోరడం లేదు. మీకు ధన్యవాదాలు'' అని విదిలించింది అతన్ని. నాకు అట్లానే అనాలనిపించింది... కాని అతను వొదల్లేదు. ఓ జట్కాపోతోంది రోడ్డుమీద. పిలిచాడు. జట్కావాడికి ఆ పెద్దమనిషి మమ్మల్ని చూపి, ''వీర్ని ఎక్కడికివెళ్లాలో అక్కడికి తీసుకెళ్లు'' అన్నాడు. లీలకి నాకు అతనిచొరవమీద కోపంవచ్చింది. కాని ఇంటికివెళ్ళడం అవసరమయ్యే... మనసులో అతన్ని అభినందించుకుంటూ, పైకి అతన్ని రుసరుసచూస్తో ఇద్దరం జట్కా ఎక్కాం. అడక్కుండా అంత సాయంచేసిన పెద్దమనిషి పేరైనా అడక్కపోడం మరియాదగా తోచలేదు నాకు. బండి లోంచే తల బైటికి పెట్టి ''మీ పేరు?'' అని అడిగాను. లీలకి ఇది నచ్చదని తెలిసే. బండి దగ్గిరికి వొచ్చి, ''నా పేరు సోమసుందర్. అసిస్టెంట్ డైరెక్టర్, వీణాఫిలిమ్స్'' అన్నాడతను. పైగా, మరియాద ధ్వనించే గొంతుతో, ''మీ రెవరో తెలుసుకోవచ్చా?'' అని అడిగాడు నమ్రతగా. లీల ఆగ్రహంగా, ''దానికేం, నేను లీల డాటర్ ఆఫ్ రంగారావుగారు డ్యాక్టర్, తేనాంపేట. ఈమె కల్యాణి. డాటర్ ఆఫ్ ఆనందరావుగారు లాండ్ లార్డు... తేనాంపేట. చాలునా? ఇంకేమన్నా కావాలా?'' అని, బండివాడితో ''తోలవోయ్!'' అంది. మా అపరిచిత వుపకారి కాస్త చిన్నబోయాడు. దీపాలకాంతిలో జట్కావాడిదగ్గరికి వెళ్ళి, హిందీలో ఏదో అన్నాడు. తర్వాత నా వంక చూచి ''నమస్తే'' అని హోటల్లోకి వెళ్ళిపోయినాడు. బండి తొరతొరగా తేనాంపేటవైపుకి సాగిపోయింది. లీలకు నా చొరవకి నా మీద కోపంగాబోలు. దారిపొడుగూతా మౌనంగా వుండిపోయింది.

2

రెండురోజులు లీల మాయింటికి రాలేదు. కాలేజీలోనూ నాతో మాట్లాడలేదు. ఏమిటీ! దాని కింత కోపంవుంటే, నాకుమాత్రం వుండదూ? కాని, దసరా సెలవులిచ్చారు. మొదటి రోజునే లీల మాయింటికి రాకతప్పలేదు - పొద్దుపోక. ''కోపం ఇప్పటికన్నా పోయిందా లీలా?'' అన్నాను. లైబ్రరీరూంలో కూర్చుని '' ఎక్కువైందిగూడానూ!'' అన్నది చేతిలో పుస్తకం ఎదురుగా బల్లమీద పడేసి.

''మరి ఇంకోవారం మాట్లాడకపోయివుందువే, కోపం ఎక్కువైతేనూ!'' అన్నాను వెటకారంగా.

''జరిగిందేమిటో సాంతం వినకుండా మాట్లాడితే చెప్పలేనే!'' అంది విసుగ్గా.

''ఏం జరిగిందేమిటి?'' అన్నాను కుతూహలం కనపరుస్తూ.

''అతను కనపడ్డాడు!''

''ఎక్కడా?''

''అళ్వార్‌పేట టర్నింగ్ దగ్గర ఎదురైనాడు నిన్న సాయంత్రం. అతన్ని చూచిగూడా తలొంచుకుని వెళ్తున్నాను. కాని అతను చాలా సన్నిహితుడల్లే పలకరించాడు. నాన్సెన్సు!''

''అతన్ని గాని నువ్వు కొట్టలేదుకద?''

''అంతపని అయ్యేదేగాని....''

''కాని......''

''విను మరి. ఎక్కడికి వెళ్లున్నారు?'' అని అడిగాడు. ''ఎక్కడికైతే ఎందుకులెండి?'' అని రెట్టించి వెళ్ళబోయ్యాను. కాని, అతను ''క్షమించండి, నేనేదైనా తప్పుచేసివుంటే.!'' అనేప్పటికి ఆగిపోయ్యాను. 'తప్పేముందండి' అన్నాను ఫీలై.

''తరువాత...!''

''తరువాత, అతని పరిస్థితులూ అవీ చెప్పి సినిమాల సంగతి ఎత్తాడు. నా సంగతి వేరే అడగాలా? తెలుగుసినిమాల మీద నా ద్వేషం అంతా వెళ్ళబోశాను. అంటే చచ్చేట్టుతిట్టాను. అతను నాతో చాలా విషయాల్లో ఏకీభవించాడు. ఈ పాత డబ్బా నటీమణులందర్నీ వెళ్లగొడితేగాని తెలుగుసినిమారంగం బాగుపడదన్నాను నేను. అతనుకూడా వొప్పుకున్నాడు. అంతటితో వూరుకోక, ''మీబోటి కుటుంబస్త్రీలూ, విద్యార్థినులూ సినిమాల్లో నటించటానికి వొస్తే మీరన్న పరివర్తన వొస్తుంది'' ని మొహానఅన్నాడు. నిజమేననుకో అతనన్నమాట. కాని మనబోటివాళ్ళం సినిమాల్లో నటించటానికి, అక్కడి వాతావరణం ఎంతమాత్రం అనుకూలించదు. అదొకనరకం. ఈమాటే అతనితో నిర్మొహమాటంగా అన్నాను. శీలవతియైన స్త్రీ ఈరోజున తెరమీదచూపే అసహ్యదృశ్యాల్నే చూడ లేకుండావుండే. ఇక సినిమాల్లో నటించటానికి రావడమా?'' అని నేననేటప్పటికి అతని మొహం ఎర్రబడ్డది.

''ఏమన్నా సమర్థించాడా. అదంతా అబద్ధమని?''

''చెప్పేది వినవే సాంతం. సినిమాల్లో నటిస్తే శీలాన్ని కాపాడుకోవచ్చునట! శీలవతియైన స్త్రీ ఎక్కడైనా తన ప్రవర్తనవల్లనే శీలవతి ఔతుందిగనక, సినిమాల్లో కుటుంబస్త్రీలు నటించటంవల్ల వాళ్ళకేమీ నష్టం వుండదట. ఇది అతనివాదన. మీ మొగాళ్ళు, ఎంతశీలవతినైనా ఏదోవిధంగా నాశనం చేయడానికే చూస్తారన్నాను తీవ్రంలేని వ్యంగ్యధోరణిలో. అతను చాలా అవమానం ఫీలైనాడు. 'అందరూ అట్లావుండరండీ. పొరబడుతున్నారు' అన్నాడు. ఇంతలో ఏం జ్ఞాపకం వచ్చిందో ఏమో, ''టైం అయిందండి, వెళ్తాను'' అని జయాస్టూడియోస్ వైపు వెళ్ళిపోయాడు.

''పోతే పోయినాడుగాని, ఎప్పణ్ణించో సినిమాల్లో నటించాలనుకుంటున్నావుగదా! ఈ అసిస్టెంట్ డైరెక్టర్‌గారి హామీతో, సినిమాల్లో చేరుతావా?'' అన్నాను హేళనగా. లీల శాంతంగానే చెప్పింది!

''ఇంకా కొన్ని సందేహాలున్నై. అవిగూడా తీరినట్టయితే సినిమాల్లోకి వెళ్ళాలనేవుంది'' అన్నది.

''ఎంతయినా కళాభిమానివి! కాని, ఇప్పటి ఈ సమాచారం గూడ మొగవాడి ఎత్తేనేమో అని నాభయం'' అన్నాను నిజంగానే అట్లా ఫీలై.

''అదేనా ఆలోచనగూడాను! అయితే నా సంగతి తెలుసుగద! ఏదైనా కాస్త అనుమానానికి ఆస్పదమైన విషయం గోచరించినా, ఎడంకాలు స్లిప్పరు వుండనేవుందాయెను'' అన్నది ధీమాగా. నిజమే లీల దేనికీ వెనకాడే స్వభావం గలది కాదు. అంత మొండిధైర్యం కలది మా స్నేహితురాళ్ళలో లేనే లేరని చెప్పాలి!

''ఏమో జాగ్రత్తగా వుండాలి సుమా!''

''ఏం ఫరవాలేదు'' అని షికారు బయల్దేరింది లీల. నేనూ వెళ్ళాను కూడా.

3

ఐదారు రోజులవరకూ లీల పత్తాలేదు. నేనైనా దాని కోసం వాళ్ళింటికి పోవడానికి పడలేదు. వారం తర్వాత మా యింటికి వొచ్చింది. సంతోషంగా కనపడ్డది. '' ఏమిటోయ్! చాలాకులాసాగా కనపడ్తున్నావు!'' అని అడిగాను. లీలని కదిలిస్తేగాని వాగుడులోకిదిగదు. లైబ్రరీరూమ్‌లో టేబుల్ మీద కూర్చొని కళ్ళు ఓర్గాపెట్టి, ''కళ్యాణీ! నేను ఏపోజులో బావుంటానో చెప్పు!'' అంటూ గొల్లుమని నవ్వింది. నాకేమీ అర్థంకాలేదు దానిధోరణి. ''కల్యాణీ! నేను ఈవారంరోజులూ ఏంజేస్తున్నానో తెలుసా?'' అని అడిగింది నవ్వాపి.

''నాకు జ్యోతిషం రాదుగా!'' అన్నాను.

''ఊహించి చెప్పుకో!'' అంది కొంటెగా.

నాకు ఓ ఆలోచనపోయి, '' ఆఁ!... అసిస్టెంటు డైరెక్టరుగారితో ఏ స్టూడియోకన్నా వెళ్ళావేమో!'' అన్నాను.

''రైట్! అంతే! స్టూడియోకివెళ్ళాను. స్టూడియోలో నేననుకున్నట్టు నరకంగాలేదు. అయితే ప్రతిమగవాడు ఇదొక జాడ్యమా అన్నట్టు, నన్ను తెగచూచాడు. నేను వాటిని లెక్కజేయలేదు. సోమసుందరంగారు నన్ను అతి ఆప్యాయంగా తీసుకెళ్ళి మేకప్ చేయించి నాల్గైదు 'స్టిల్సు' తీయించాడు. ఆయనకి మంచి గౌరవమే వుందక్కడ''.

''అయితే సినిమా కళోద్ధరణకి దిగావన్నమాటే!''

''చెప్పేది వినవే అడ్డం మాట్లాడకండా. ఆ తర్వాత స్టూడియోలో వివిధభాగాల్ని చూశాను. బైటికి వచ్చింతర్వాత సోమసుందరంగార్ని అడిగాను - నా పర్సనాలిటీ ఎల్లావుందని.''

''చక్కని కవిత్వం అల్లివుంటాడు.''

''ఛీ! వినవే. మరియాదగా అన్నాడుగదా, మీ ఫేస్ కట్ ఫిలిం కెమరాకి సూట్ అయింది. మీ గొంతుగూడా మైకెకి సరిపోయింది. మీకు అభ్యంతరం లేకపోతే, మేము తీయబొయే సాంఘిక చిత్రంలో నటించవచ్చు. కంట్రాక్టు మీ ఇష్టప్రకారమే రాసిస్తా'' నన్నాడు. ఏమే కల్యాణీ! సినిమాల్లో చేరనా?'' అని అతి వుత్సాహంగా అడిగింది లీల.

''చేరవచ్చు...కాని...''

''ఆ 'కాని' ఎందుకూ మధ్య?''

''నురి సంఘం అంటూ వుందిగా, అది ఏమనుకుంటుందో అని నా జిజ్ఞాస.''

''ఆ సంఘం ఏమనుకున్నా, నేనేం తప్పుడుపన్లు చేయడం లేదుగా? పోతే, కళోపాసనగూడా దానిదృష్టిలో తప్పే ఐతే, నేను ఈ సంఘాన్ని గాని దాని తాతనుగాని లెక్కచేయదలుచుకోలేదు.''

''సరే నీ యిష్టం... నా సలహా అల్లా, ఈ మొగాళ్ళతో జాగ్రత్త అనిమాత్రమే'' అన్నాను నవ్వుతూ హృదయస్ఫూర్తిగా. '' ఏమీ ఫరవాలేదు. ఎడం కాలిస్లిప్పరు లేదుటే!'' అన్నది లీల ధీమాగా.

4

అర్జంటుగా మా అన్నయ్య పెళ్ళి ఒకటి వచ్చి మా కుటుంబమంతా గుంటూరు వెళ్ళవల్సివచ్చింది. నెలరోజులకి తిరిగివచ్చాం. ఆవేళే మే మొచ్చామని తెలిసింది గావును, లీల పరిగెత్తుకొచ్చింది. ఇద్దరం డాబాగదిలో కూర్చున్నాం చల్లగాలికి. నేను అడిగాను మొదట.

''షూటింగులు జరుగుతున్నాయా? ఫిలిం పేరేమిటి? నీపాత్ర ఏమిటి? కథ ఏమిటి? అని ప్రశ్నల వర్షం కురిపించాను. లీల మాట అన్నదా జరిగితీరుతుందని నాకు గట్టినమ్మకం. కాని లీలవర్చస్సు ఉద్రిక్తంగా మారింది.

''ఏం గొడవగా కంగారుపడి పోతున్నావు! నిదానించు. షూటింగులూ లేవు, ఏమీలేవు'' అన్నది శ్వాస గట్టిగాపీల్చి.

''కంట్రాక్టు రాసుకునేదాకా వచ్చిందిగా కథ! ఇంతలో ఎట్లా మార్చుకున్నావు?''

''వొచ్చినమాట వాస్తవమే, కాని అక్కణ్ణుంచి కథ అడ్డం తిరిగింది. విను చెబుతా. నేనూ సోమసుందరం రోజూ కలుసుకుంటూ, వాళ్ళు తియ్యబొయ్యే పిక్చర్నుగురించీ, దాని కథ, నా కిస్తాన్న వేషం గురించీ వివరంగా మాట్లాడుకున్నాం. ఇన్నాళ్ళబట్టి రోజూ కలుసుకుంటూవుంటే మాలో చనువు ఏర్పడదూ మరి?''

''చనువేం ఖర్మం? చులకనగూడాను మగవాడికి'' అన్నాను నేను.

''అదే చెప్పొస్తుంటే నువ్వే చెప్పావు. నాకు వాళ్ళ పిక్చరునుగురించి యావత్తూ తెలిసింతర్వాత స్టూడియోకి వెళ్లాను కంట్రాక్టువ్రాసుకోడానికి. కంట్రాక్టులో అన్నీ నా యిష్టప్రకారమే వ్రాశారు.

కం(ట్రాక్టుప(త్రం మా నాన్నకి చదివి వినిపించింతర్వాత సంతకంచేస్తానని తీసుకుని సంచిలో పెట్టుకుని బయల్దేరాను. అప్పటికే పొద్దుకూకింది. చీకటిపడ్డది స్టూడియోబయట వరండావరకూ అసిస్టెంటు డైరెక్టరుగారు నన్ను సాగనంపడానికి వచ్చారు. వరండాలో ఎవ్వరూ లేరు. బావురుమంటోంది.

''ఒక్కమాట'' అన్నాడతను.

వెనక్కితిరిగి చూశాను. సహజంగా అతని మొహంలో కళలు నాకు బోధపడలేదు చీకట్లో. ''ఏమిటది, చెప్పండి'' అన్నాను నవ్వుతో. ''మిమ్మల్ని'' అంటూ నా దగ్గిరికి వొస్తున్నాడు. నాలికతడబడుతోంది అతనికి, నావళ్ళు జలదరించింది. కాని అతనిపై నేరారోపణచెయ్యడానికి అంతవరకు ఏ అవకాశమూ ఇవ్వలేదతను. ''ఏమిటో చెప్పండి!'' అని రెట్టించాను.

''చెప్పలేకపోతున్నాను'' అంటూ నా భుజం మీద చెయ్యేశాడు.

వెంటనే ఏమీ అనకండా, రెండడుగులు వెనక్కితగ్గి చప్పున ఎడం కాలి స్లిప్పరు వూడదీసి చెంప చెళ్ళుమనేట్టు దెబ్బపీకాను. వెంటనే ఇంటికివచ్చి కం(ట్రాక్టుకాగితం చించివేశాను. మానాన్న నాలో ఈ అకస్మాత్తు మార్పుకి చాలా ఆశ్చర్యపడి ''ఏమిటిది?'' అని అడిగాడు. ''అక్కడి వాతావరణం బాగులేదు నాన్నా'' అని సర్దేశాను. లేకపోతే...''

''లేకపోతే, నువ్వు ఊడగొట్టినవిపోను మిగతాపళ్లు మీ నాన్న వూడగొట్టేవాడే...''

'' ఆఁ! అంతపనీ అయ్యేదే. కాని మనబోటి వాళ్ళం ఇప్పట్లో సినిమారంగంలోకి దిగే అవకాశం కనిపించడం లేదు కల్యాణీ!'' అన్నది లీల బాధగా.

''నిజమే. ఈ సినిమా మగాళ్ళు, మనసులు మార్చుకొంటే తప్ప!''

''కాదు! కాదు! చదువుకున్న వాళ్లూ, స్త్రీలని నిజంగా గౌరవించగలవాళ్ళూ సినిమారంగంలోకి వస్తే అప్పటికేమన్నా...''

''అవును!''

(కథావాహిని 1955)